క్లుప్తంగా

వైభవంగా పార్వేట ఉత్సవం



గ్రామోత్సవానికి సిద్ధమైన కోదండరాముడు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని దక్షిణపువీధి కోదండ రామాలయంలో జరుగుతున్న సీతారాముల ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం పార్వేట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పూలతో సుందరంగా అలంకరించారు. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

పరమేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో పరమేశ్వరుడు

ఉదయగిరి: మండలంలోని గుడినరవ శివాలయంలో సోమవారం భక్తులు పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, పారామిలటరీ బలగాలు

సంగం: మండల కేంద్రమైన సంగంలో సోమవారం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జున రెడ్డి పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బస్టాండ్ సెంటర్‌లో ఇరు పార్టీల నాయకుల మధ్య జరిగిన ఘర్షణను దృష్టిలో పెట్టుకుని ఈ పోలీసు కవాతు చేపట్టారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

నాసిరకంగా రోడ్డు పనులు



కంకర తేలిన రోడ్డు

అనుమసముద్రంపేట: కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న హసనాపురం–ఆత్మకూరు రోడ్డు నాసిరకంగా చేపడుతున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ముస్తాపురం నుంచి హసనాపురం వరకు తారురోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుపై కంకర వేశాక నీళ్లు పోయడం మరిచారని, పనులు నాసిరకంగా చేపడుతున్నారని ఆరోపించారు. రోడ్డు పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుపై వేసిన కంకరతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

13న ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబవుతున్న పుష్కరిణి

అల్లూరు: స్థానిక అల్లూరు కోనేరు సెంటర్‌లో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 13వ తేదీ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీన కోనేరు సెంటర్ నుంచి హనుమాన్ శోభయాత్రలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ అల్లూరు పేట మీదుగా తిరిగి కోనేరు సెంటర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 13వ తేదీ ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వీర విధేయులం.. మమ్మల్ని మరవొద్దు

- కీలక పోస్టింగ్‌ల కోసం పైరవీలు
- ప్రభుత్వం మారడంతో ప్రధాన పోస్టులపై గురి
- టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్న కొందరు మున్సిపల్ అధికారులు
- కార్పొరేషన్ కమిషనర్ పోస్టు కోసం పలువురు పోటీ



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): ఎన్నికల ఫలితాలు వెలువడి అధికార మార్పిడి జరగడంతో తమకు ప్రాధాన్యత పోస్టింగులు ఇవ్వాలని కోరుతూ పలువురు మున్సిపల్ అధికారులు కొత్త ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు తమకు పరిచయం ఉన్న టీడీపీ నాయకుల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. తిరిగి తమ పోస్టింగులు తమకు ఇవ్వాలని కోరుతూ టీడీపీ నేతల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రసన్నం చేసుకునే యత్నాలు

కొత్తగా ఎంపికైన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ప్రసన్నం చేసుకునేందుకు కార్పొరేషన్ అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులు కూడా నేతల ఇళ్ల వద్ద క్యూ కడుతున్నారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. నెల్లూరు నగరపాలక సంస్థలోని పలు కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు వేయించుకుంటే తమ చేతి వాటాన్ని ప్రదర్శించుకోవచ్చని పలువురు అధికారులు తమవంతు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇందుకోసం మూడు రోజులుగా పలువురు అధికారులు, సిబ్బంది నేతలను కలిసి శుభాకాంక్షలు తెలపడంతోపాటు పోస్టింగుల అంశాన్ని ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. ఇలాంటి వారిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కీలక స్థానాల్లో పనిచేసిన వారు కొందరు ఉండగా.. ప్రస్తుతం కార్పొరేషన్‌లోనే లూప్‌లైన్‌లో పనిచేస్తున్న వారు మరికొందరు ఉన్నారు.

కమిషనర్ పోస్టు కోసం

నెల్లూరు జిల్లా ప్రశాంత వాతావరణానికి మారు పేరు. ఇక్కడ పనిచేసేందుకు ఇతర జిల్లాల్లోని ఏ అధికారి అయినా మొగ్గుచూపుతారు. నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్‌గా విధులు నిర్వర్తించేందుకు పలువురు పోటీ పడుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధానంగా గతంలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన అధికారులు ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన వారిలో ఇద్దరు అధికారులు మరలా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా రావాలనే ప్రయత్నం చేసుకుంటున్నారని సమాచారం. పోటీ పడుతున్న ఇద్దరు అధికారుల్లో ఎవరికి అవకాశం దక్కుతుందో ఎదురుచూడాల్సిఉంది. గతంలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఓ అధికారి ప్రస్తుతం గెలుపొందిన టీడీపీ ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారని తెలుస్తోంది. ఈ పోస్టు కోసం ఇంకెంత మంది అధికారులు ప్రయత్నాలు చేసుకుంటారో చూడాలి.

మమ్మల్ని మరవొద్దు

తాము మొదటి నుంచి విధేయులుగా ఉన్నామని.. తమను మరవొద్దని పలువురు అధికారులు, సిబ్బంది కీలకమైన పోస్టులను దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కార్పొరేషన్ కార్యాలయంలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా ప్రస్తుతం లాభదాయకంగా ఉన్న పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు ఉద్యోగులు తమ పోస్టుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా (మార్చకుండా) చూడాలని తమ సీటును పదిలం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు నగదు బహుమతులు



హలీమసాధియాకు నగదు బహుమతి అందజేస్తున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రభుత్వ బీసీ వసతి గృహంలో విద్యనభ్యసించి 2023–24 సంవత్సరంలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ బీసీ కళాశాలల వసతి గృహ సంక్షేమాధికారులు, ప్రీమెట్రిక్ వసతి గృహ సంక్షేమాధికారులు, సహాయ బీసీ సంక్షేమాధికారులకు సోమవారం నగరంలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి వై.వెంకటయ్య మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నుంచి కళాశాలల వసతి గృహాలు పునఃప్రారంభించామని, 13వ తేదీన ప్రీమెట్రిక్ వసతి గృహాలను ప్రారంభించాలని తెలిపారు. వసతి గృహ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, వసతి గృహ సంక్షేమాధికారులు, నాలుగో తరగతి సిబ్బంది వారు పనిచేసే ప్రాంతాల్లోనే నివాసం ఉండాలని, ప్రభుత్వం జారీ చేసిన జాబ్‌కార్డు ప్రకారం విధులకు హాజరుకావాలని ఆదేశించారు. రెన్యువల్ విద్యార్థులను జూన్ 30వ తేదీలోపు చేర్చుకుని సమాచారాన్ని సంబంధిత జిల్లా కార్యాలయాలకు తెలియజేయాలన్నారు. నూతన ప్రవేశాల కోసం వచ్చిన దరఖాస్తులను హాస్టల్ అడ్వైజరీ కమిటీ ద్వారా ఆమోదించుకుని జులై 31వ తేదీ లోపు జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయానికి అందజేయాలని, వసతి గృహం ప్రారంభించినప్పటి నుంచి స్టడీ అవర్స్ నిర్వహించాలని, మెరుగైన ఫలితాలు సాధించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరంలో బీసీ వసతి గృహంలో 10వ తరగతి చదివి 586 మార్కులు సాధించిన ఎస్కే హలీమసాదియా (ఆత్మకూరు బీసీ వసతి గృహం)కు కార్యాలయ పర్యవేక్షకులు శ్యాంసన్ రూ.5,000, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుజన అందజేసిన నగదు బహుమతులను జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, సహాయ బీసీ సంక్షేమాధికారులు ప్రసూన, శ్రీదేవి, తేజోవతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యవ్వనస్తుల కూడిక



ఉజ్జీవ కూడికలో పాల్గొన్న పాస్టర్లు, యువత

నెల్లూరు(బృందావనం): హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీ, జీసస్ లివింగ్ ప్రేయర్ హౌస్ సంయుక్తంగా నిర్వహించిన ఉజ్జీవ యవ్వనస్తుల కూడికలో క్రైస్తవ యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని రామిరెడ్డిపేట మూలపేటలోని ది తెలుగు సెకండ్ బాప్టిస్ట్ చర్చిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రెవరెండ్ బి.డేవిడ్ దయాసాగర్, యూత్ డైరెక్టర్ బ్రదర్ బి.హవిలాష్ ప్రేమ్‌సాగర్ వాక్యోపదేశం చేశారు. పాటల పోటీలు, బైబిల్ క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. కార్యక్రమంలో జీసస్ లివింగ్ ప్రేయర్ హౌస్ పాస్టర్ శశికాంత్, ది తెలుగు సెకండ్ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు ఉరుందురు సురేంద్ర, కార్యదర్శి కుమార్, బాప్టిస్ట్ చర్చి డొనీహాలు కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, బ్రదర్ జానీదో, బ్రదర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు(పొగతోట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు జరుగుతున్న ప్రదేశాల్లో వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.పుల్లయ్య, వెంకమరాజు కోరారు. ఆ మేరకు సోమవారం నగరంలోని డ్వామా పీడీ కార్యాలయంలో పీడీ వెంకట్రావ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కూలీల బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాంతారావు, రాధాకృష్ణమూర్తి, తమఐయ్య, విజయ్‌కుమార్, నాగమ్మ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు హాజరై క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పద్మ ప్రియ ఫైనాన్షియర్స్, మేఘన ఆటోమొబైల్స్ అధినేత గడ్డం వెంకటరత్నం సౌజన్యంతో క్రీడాకారులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి ఒ.జయదేవ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర, భాను, మేఘశ్యామ్, మాల్యాద్రి, ఓబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హుస్సేన్, నారాయణరావు, రాజారమేష్, పొన్నం రవిచంద్ర, సుబ్బరామిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ బాలరామయ్య నాయుడు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు వసతి సౌకర్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పప్పుల వీధిలో ఉన్న శ్రీపాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆ సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, హాస్టల్ కమిటీ చైర్మన్ వాయుగుండ్ల హజరత్తయ్య సోమవారం తెలిపారు. నగరంలోని విద్యాసంస్థల్లో 2024–2025 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఇందుకు అర్హులని తెలిపారు. శ్రీపాండురంగ అన్నదాన సమాజం కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి దరఖాస్తులు అందజేస్తామని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీన అర్హులైన విద్యార్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకలు విజయవంతం చేయండి

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల వేడుకలు విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి కోరారు. సోమవారం నగరంలోని సంఘమిత్ర హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ప్రారంభించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్టోబర్‌లో విజయనగరంలో నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చెంగల్రాయ, సీహెచ్‌వీ రెడ్డి, జుల్ఫికర్‌అలీ, బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పిచ్చిబాబు, బాధ్యులు కె.సుబ్బారెడ్డి, బి.కోటీశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎ.నారాయణ, సి.సుబ్బారావు, బాలత్రిపురసుందరి, సి.వెంకటేశ్వరరెడ్డి, సి.రాజు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సిబ్బందికి ఆన్‌లైన్ శిక్షణ



సిబ్బందికి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్న డీసీఓ గురప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, వైఎస్సార్ జిల్లాలకు చెందిన సహకార సిబ్బందికి సోమవారం ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ గుంటూరు వారి ఆదేశానుసారం ప్రొద్దుటూరు సహకార శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరు సహకార శాఖాధికారి, రిసోర్స్ పర్సన్ గురప్ప నేతృత్వంలో ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘాలకు, డీసీసీ బ్యాంకులకు రావాల్సిన బకాయిల వసూళ్లు, బకాయిదారులకు నోటీసులు ఇచ్చే విధానం, కోర్టుల్లో దావాలు, భారతీయ కాల దోష చట్టం, స్థిర, చరాస్తుల జప్తు, వేలం వేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, కావలి డివిజనల్ సహకార అధికారి యలమందరావు, ప్రొద్దుటూరు సహకారశాఖ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సహకారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ (డీకే) బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న హాస్టల్‌ను పూర్వ విద్యార్థినుల సహకారంతో ఆధునీకరించడం శుభపరిణామమని, వారి సహకారం మరువలేనిదని ఆ కళాశాల ప్రిన్సిపల్, నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు అన్నారు. సోమవారం డీకేడబ్ల్యూ కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు నెల రోజుల్లో పూర్వ విద్యార్థినులు అందించిన రూ.7 లక్షలు కలుపుకొని రూ.8.5 లక్షలతో పనులు చేపట్టారన్నారు. డిప్యూటీ వార్డెన్ జి.కరుణకుమారి మాట్లాడుతూ గత మూడేళ్లలో హాస్టల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. క్రమశిక్షణ, స్టడీ అవర్ల నిర్వహణపై కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఒ.కొండయ్య వివరించారు. సమావేశంలో హాస్టల్ కమిటీ సభ్యులు శ్రీదేవి, రమాదేవి, రేవతి, కళాశాల పూర్వ విద్యార్థినులు ఒ.కుసుమకుమారి, శేషమ్మ, డాక్టర్ ఎస్.జయలక్ష్మి, ఇందూరు సుజాత, సీహెచ్ సుజాత, డాక్టర్ ప్రసన్న, ప్రమీల, పూర్ణచంద్రకుమారి, కృష్ణతులసి, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, సుధారాణి, లెక్చరర్లు వెంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, రమణారెడ్డి, శ్రీధర్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు



వెండిచీర అలంకరణలో గంగమ్మతల్లి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పడారుపల్లిలోని గంగమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి వెండి చీరను అలంకరించారు. గ్రామంలోని మహిళలు గంగమ్మతల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి



నెల్లూరు(బృందావనం): నగరంలోని వైఎంసీఏ వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సహాయ సహకారాలు అందించాలని జేఎస్‌టీవీ ఎండీ బర్నాబాసు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు కోరారు. సోమవారం ఆ ప్రాంతాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో దాసు, రాఘవ, మోజెస్, వి.జోసెఫ్, ప్రభుకుమార్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి



గర్భిణికి టానిక్ అందజేస్తున్న డాక్టర్ రమ్య

కావలి: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకుంటూ రక్తహీనతను అధిగమించాలని వెంగళరావునగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య సూచించారు. హెల్త్ సెంటర్‌లో డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో తరచూ ఎదురయ్యే రక్తహీనత సమస్య, కారణాలు, నివారణ, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవడం, వైద్యపరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవడం ద్వారా రక్తహీనతను సులభంగా ఎదుర్కోవచ్చని వివరించారు. అనంతరం డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తహీనతను అరికట్టే టానిక్‌లు, క్యాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ డి.మనోహర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

టీకాలే చిన్నారులకు రక్ష

- వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



చిన్నారికి టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

దుత్తలూరు: గర్భిణులతోపాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే అధికశాతం మంది ప్రజలకు ఈ టీకాలపై సరైన అవగాహన లేక సమయానికి టీకాలు వేయించక అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ వ్యాధి నిరోధక టీకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

టీకాలు పొందడం ఇలా..

ప్రతి శని, బుధవారాలు చిన్నారులకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తారు. గర్భిణులకు గర్భం దాల్చిన తొలి రోజుల్లో టీడీ–1 నాలుగు వారాలకు, టీడీ–2 చివరి గర్భధారణ, టీడీ బూస్టర్ మూడేళ్ల తర్వాత గర్భం దాల్చే వారు రెండు టీడీ మోతాదులు వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటితోపాటు ఐరన్ పోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోస్ వేయాలి. వీటి వలన పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి చిన్నారులను కాపాడవచ్చు. 14 రోజుల వ్యవధిలో బీసీజీ టీకా వేయాలి. ఆరు వారాలు, 14 వారాల్లో ఐడీవీ చుక్కలు వేయాలి. వీటితోపాటు ఆరు వారాలు, 10–14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు పెంటావాలెంట్ వేయాలి. వీటి వల్ల కోరింతదగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు వ్యాధి రాకుండా చిన్నారిని కాపాడుకోవచ్చు. 9–12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మ్యూజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయాలి. 16–24 నెలల వ్యవధిలో బూస్టర్‌డోస్ డీటీటీ మ్యూజిల్స్, విటమిన్–ఏ, ఓపీడీ వేయాలి. ఐదు సంవత్సరాలు పూర్తయితే డీటీటీ ఒక డోసు వేయాలి. పది సంవత్సరాలు, పదహారు సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయాలి. 9 నెలల నుంచి ఐదేళ్ల వయస్సు లోపు ప్రతి ఆర్నెల్లకోసారి విటమిన్–ఏ 9 డోసులు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

టీకాలపై అవగాహన అవసరం

> గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశిత వేళల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వాటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ టీకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.
>
> – డాక్టర్ అయూబ్‌అఫ్సర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దుత్తలూరు